ఇదిగిదిగో ఇక్కడే బస్టాప్ ఉండేది..!

కనుమరుగువుతున్న బస్ షెల్టర్లు



ఇదిగో కనిపిస్తున్న కారు ప్రాంతంలోనే జడ్జికోర్టు బస్టాప్ ఉండేది (ఆరిలోవ, మధురవాడ, పీఎం పాలెం, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల నుంచి జగదాంబ జంక్షన్ మీదుగా పాతపోస్టాఫీస్ వెళ్లే బస్సులు ఇక్కడ ఆగేవి)

డాబాగార్డెన్స్: విశాఖ మహా నగరం విస్తరిస్తోంది. ఒకప్పటి నగర పాలక సంస్థ..గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అయ్యింది. మరింత విస్తరించి స్మార్ట్‌సిటీగా అవతరించింది. అందుకు తగ్గట్టుగా జనాభా పెరిగింది. పట్టణానికి వలసలు పెరిగాయి. కొత్త కొత్త ప్రాంతాలు రూపొందాయి. వీధులు పెరిగాయి. అందుకు తగ్గట్టుగానే నూతన బస్టాప్‌లు ఏర్పడ్డాయి. అక్కడకు కట్ చేస్తే..

పట్టణం విస్తరిస్తోన్న నేపథ్యంలో పలు ప్రాంతాలు కనుమరుగవుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ఉన్న బస్టాప్‌లు ప్రస్తుతం ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి. బస్ షెల్టర్లు కనుచూపుమేర కనపడడం లేదు. అందుకు పై చిత్రాలే ఉదాహరణ. నియోజకవర్గ పరిధిలో ఇటు పాత పోస్టాఫీస్ నుంచి చూసుకుంటే..లక్ష్మీటాకీస్..టౌన్‌కొత్తరోడ్డు.. వెలంపేట.. దుర్గాలమ్మ గడి నుంచి ఓ వైపు బౌడరారోడ్డు.. కాన్వెంట్ జంక్షన్.. జ్ఞానాపురం మీదుగా సుదూర ప్రాంతాలకు బస్సులు నడిచేవి.

ప్రస్తుతం నడుస్తున్నాయి కూడా. అలాగే దుర్గాలమ్మ గుడి నుంచి పోలీస్ బ్యారెక్స్, సూర్యాబాగ్, డాబాగార్డెన్స్, టూటౌన్ బస్టాప్.. ఆర్టీసీ కాంప్లెక్స్..సంగం శరత్ థియేటర్..దొండపర్తి మీదుగా అక్కయ్యపాలెం తదితర ప్రాంతాలకు బస్సులు నడిచేవి..ప్రస్తుతం నడుస్తున్నాయి కూడా. మరో వైపు దుర్గాలమ్మ గుడి నుంచి పోలీస్ బ్యారెక్స్, జగదాంబ జంక్షన్, జడ్జికోర్టు బస్టాప్..జైల్‌రోడ్డు బస్టాప్..ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీల్‌మెట్ట బస్టాప్ మీదుగా ఆరిలోవ, రవీంద్రనగర్, పీఎం పాలెం, మధురవాడ, జూ తదితర ప్రాంతాలకు బస్సులు నడుస్తున్నాయి. ఇంకో వైపు దుర్గాలమ్మ గుడి నుంచి పోలీస్ బ్యారెక్స్, జగదాంబ బస్టాప్, అప్సర బస్టాప్, రాంనగర్, సర్క్యూట్ హౌస్ మీదుగా ఓ వైపు పెదవాల్తేర్..మరోవైపు చినవాల్తేర్ మీదుగా ఎంవీపీ కాలనీ, రుషికొండ తదితర ప్రాంతాలకు బస్సులు గతంలో నడిచేవి. బస్టాప్‌లు, బస్ షెల్టర్లు కూడా ఉండేవి.

అనూహ్య మార్పు..

దశాబ్ద కాలం కిందటి నుంచి నగరంలో అనూహ్య మార్పు వచ్చింది. రోడ్డు విస్తరణలో కొన్ని బస్టాప్‌లు కోల్పోగా..దుకాణాలు..షాపింగ్ మాల్స్ దృష్ట్యా మరికొన్ని బస్టాప్‌లు కనిపించకుండా పోయాయి. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందంటే.. ఎక్కడ కొంత మంది ప్రయాణికులు ఉన్నారంటే.. అక్కడే బస్టాప్ ఉన్నట్టు లెక్క. వెలంపేట, దుర్గాలమ్మ గుడి బస్టాప్, రామకృష్ణా బస్టాప్, ఇటు పోలీస్ బ్యారెక్స్, డాబాగార్డెన్స్ రూట్‌లో టూటౌన్ బస్టాప్ (అంబేడ్కర్ కూడలి ముందు), జడ్జికోర్టు బస్టాప్(సీఎంఆర్ ఎదురుగా), అప్సర బస్టాప్ (ప్రస్తుతం అగర్వాల్ కంటి ఆసుపత్రి ఉన్న ప్రాంతం), రాంనగర్ బస్టాప్ (ఓమ్నీ ఆర్కే ఆసుపత్రి ఎదురుగా)లు కనుమరుగయ్యాయి. అలాగే డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహ కూడలిలో టూటౌన్ బస్టాప్ ఉండేది. షాపింగ్ మాల్స్ ప్రభావంతో బస్ షెల్టర్ కనిపించకుండా పోయింది. ఈ ప్రాంతంలోనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఉండేది.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో జగదాంబ బస్టాప్ ఉండేది..(పెదవాల్తేర్, ఎంవీపీ కాలనీ, రుషికొండ తదితర ప్రాంతాల నుంచి అప్సర బస్టాప్ మీదుగా జగదాంబ జంక్షన్..పాతపోస్టాఫీస్‌కు వెళ్లే బస్సులు నిలిపేవారు)



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆటో స్టాండ్ వద్ద అప్సర బస్టాప్ ఉండేది(ఇక్కడకు పాతపోస్టాఫీస్, బీహెచ్‌పీవీ నుంచి జగదాంబ జంక్షన్ మీదుగా..అప్సర బస్టాప్‌కు.. అక్కడి నుంచి ఎంవీపీ కాలనీ, పెదవాల్తేర్, చినవాల్తేర్, రుషికొండకు వెళ్లే బస్సులు ఆగేవి)



ఇక్కడో బస్టాప్ ఉండేది. అదే పేరు టూటౌన్ బస్టాప్. గతంలో ఇక్కడే టూటౌన్ పోలీస్ స్టేషన్ ఉండేది (ఈ బస్టాప్ మీదుగా పాతపోస్టాఫీస్ నుంచి అక్కయ్యపాలెం, కైలాసపురం, సింహాచలం తదితర ప్రాంతాలకు బస్సులు నడిచేవి)



ఈ చిత్రంలో దుర్గాలమ్మ బస్టాప్ ఉండేది.. (ఈ బస్టాప్ మీదుగా పాతపోస్టాఫీస్ నుంచి సింహాచలం, కంచరపాలెం, పెందుర్తి తదితర ప్రాంతాలకు బస్సులు వెళ్లేవి)

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

దందాలు, వసూళ్లకు పాల్పడితే చర్యలు

డాబాగార్డెన్స్: దందాలు, వసూళ్లకు పాల్పడితే తన దృష్టికి తీసుకురావాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధి విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో గల ఫుడ్ కోర్టును శనివారం ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఫుడ్‌కోర్టు షాపుల నిర్వాహకులతో మాట్లాడారు. అద్దెల వసూళ్లకు పాల్పడినా, ఒకరికే అధిక దుకాణాలు ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యత, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని దుకాణదారులకు సూచించారు.

క్లుప్తంగా

మీడియా ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణ



ఏపీ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని,క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ మీడియా ఆఫీసర్స్ అందరు సమయాన్ని బట్టి అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య సిబ్బందిని ప్రేరణ కలగజేసే విధంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి (డీమో) బి.నాగేశ్వర రావు, ప్రాంతీయ శిక్షణా కేంద్రం మీడియా అధికారులు మొయినుద్దీన్, మురళీ, అశోక్, సూర్యకుమారి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

దివీస్ ల్యాబ్స్‌కు బొల్లినేని విద్యార్థుల ఎంపిక

డాబాగార్డెన్స్: దివీస్ ల్యాబ్స్‌లో ఉద్యోగాలకు తమ విద్యార్థులు 56 మంది ఎంపికయ్యారని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు శనివారం దివీస్ ల్యాబ్స్ హెచ్‌ఆర్ ప్రతినిధులు సీహెచ్ పూర్ణప్రసాద్, రాజేష్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారని తెలిపారు. ఈ ఎంపికల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.18వేల జీతంతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చీఫ్ మేనేజర్ ఇంద్రజిత్ ముఖర్జీ, సీనియర్ మేనేజర్ కేఆర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎం.హరిప్రియ, అడ్మిన్ ఫ్యాకల్టీ అసోసియేట్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం



చిరువ్యాపారుల వద్ద ప్లాస్టిక్‌ను పట్టుకుంటున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: చిరువ్యాపారుల వద్ద నిషేధిత ప్లాస్టిక్ కవర్లను శనివారం జీవీఎంసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జీవీఎంసీ జోన్-4 పరిధి 35వ వార్డు పూర్ణామార్కెట్‌లో చిరువ్యాపారుల దుకాణాల వద్ద నిషేధిత ప్లాస్టిక్‌పై దాడులు చేశారు. ఈసందర్భంగా వ్యాపారుల నుంచి 13 కేజీలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, మురళి, శ్రీను పాల్గొన్నారు.

గుడ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: పాతపోస్టాఫీస్ వద్ద గల ప్రభుత్వ క్వీన్‌మేరీ బాలికోన్నత పాఠశాల బాలికలకు శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ జీడీ బాబు గుడ్ టచ్..బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. పిల్లలు బాగా చదువుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడచుకోవాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ ఎక్కువగా వాడకూడదని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్ చేయడానికి ప్రయత్నించిన వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని తెలిపారు. త్వరలోనే పదో తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ జరుగుతున్నందున పిల్లలు బాగా చదువుకోవాలని, ఉన్నత ఆశయాలు సాధించాలంటే చదువు ఒక్కటే మార్గమని ఈ సందర్భంగా జీడీ బాబు వివరించారు.

కళాశాలల్లో ఓటర్ల దినోత్సవం



ఉమెన్స్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు



ఏవీఎన్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యాపకులు, విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు ప్రాధాన్యత తెలియజేశారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి పాల్గొని ఓటు హక్కు ప్రాధాన్యత, వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్స్ డాక్టర్ కేవీఎల్ శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ జె.లావణ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు జి.జ్యోతి, డాక్టర్ ఎస్.నాగమణితో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాలలో..

ప్రజాస్వామ్య నిర్మాణానికి ఓటే పునాది రాయి వంటిదని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పేర్కొన్నారు. కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులని, యువత భాగస్వామ్యం అయినప్పుడే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, డీన్ డాక్టర్ శంకర్‌నారాయణ, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి లెఫ్టినెంట్ జె.రామారావు, ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని, డాక్టర్ జి.సునీత, సబిత, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో వెల్‌నెస్ క్లినిక్ సెంటర్ ప్రారంభం



వెల్‌నెస్ సెంటర్‌లో మెషీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్,చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్ గైనిక్ ఓపీ వద్ద వెల్‌నెస్ క్లినిక్ సెంటర్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జబ్బులు లేని ఆరోగ్యకరమైన జీవనానికి పాటించాల్సిన పరిశుభ్రత, అలవాట్లపై అదేవిధంగా క్యాన్సర్ నివారణ, జీవనశైలిపై సూచనలు, సలహాలు, క్లినిక్ విభాగానికి సంబంధించిన అంశాలతో వెల్‌నెస్ సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. ఈ వెల్‌నెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సోమవారం, బుధవారం అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ జి.రాధాకృష్ణ, డాక్టర్ వాసవిలత, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ సంధ్య దేవి, వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ.కృష్ణవేణి, వివిధ విభాగాల అధిపతులు, డాక్టర్లు, కేజీహెచ్ నర్సింగ్ సిబ్బంది, స్థానిక కార్పొరేటర్ కొడూరు అప్పలకొండ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అలరించిన సెమీ క్లాసికల్ హిట్స్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సన్‌మూర్తి, సాంబశివరావు

డాబాగార్డెన్స్: రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థ నేతృత్వంలో శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సెమీ క్లాసికల్ హిట్స్ అలరించాయి. ప్రముఖ గాయనీ గాయకులు ఆలపించిన సెమీ క్లాసికల్ సాంగ్స్ 'హాయిగా ఆమని సాగే శీర్షిక' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరిలో నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపించి మెప్పించారు. కార్యక్రమాన్ని రాగమయి సంస్థ వ్యవస్థాపకురాలు కందర్ప రాధ నిర్వహణలో గాయకులు అభి మాధవ్, కడలి సురేష్, సుధీర్‌కుమార్, నారాయణమూర్తి, ప్రియా, పావణి, రమణి, రంజిత సత్యశ్రీ పాల్గొని యుగళగీతాలు ఆలపించారు. కార్యక్రమాన్ని సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, రిటైర్డ్ నేవల్ అధికారి చాడ సాంబశివరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అప్పన్న సన్నిధిలో సినీ నటుడు శ్రీకాంత్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న శ్రీకాంత్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శనివారం సినీ నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభానికి మొక్కుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

'పీఎం సూర్యఘర్'తో విద్యుత్ ఆదా

ఏపీఈపీడీసీఎల్ ఏఈ రామకృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న ఏఈ రామకృష్ణ

పరవాడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని వినియోగించుకొని విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై మరిడిమాంబ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గృహ వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకం కోసం దరఖాస్తులు చేసుకొన్న వినియోగదారులకు రాయితీతో సోలార్ రూఫ్ టాప్‌ను నిర్మిస్తామన్నారు. వివిధ బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కూడా కల్పిస్తాయని చెప్పారు. ఇంటి పై కప్పుపై 10 చదరపు మీటర్ల స్థలాన్ని సమకూర్చడం ద్వారా ఒక కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్ ద్వారా 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం వినియోగదారుడికి రూ.1000 బిల్లు వస్తే సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు తరువాత రూ.338 బిల్లు వస్తుందని తద్వారా ఏడాదికి రూ.8 వేలు ఆదా అవుతుందన్నారు. పథకం పై గ్రామీణ ప్రాంత విద్యుత్ వినియోగదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. సదస్సులో ఏడీ బి.కనకారావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఏఈ శేషసాయి, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



25వీఎస్‌సీ41-320060 జీవీఎంసీ పాఠశాల గేటు ఎదురుగా వాహనాలు



25వీఎస్‌సీ41ఎ-320060 పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదురుగా వాహనాలు

జగదాంబ: పాతనగరంలో ట్రాఫిక్ సమస్య గుదిబండగా మారింది. బడి..గుడి..ఆస్పత్రి ప్రదేశం ఏదైనా సరే కాస్త ఖాళీ జాగా కనిపిస్తే చాలు వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా ఉంది. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకే కాకుండా పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాల ఆవరణలను సైతం ఆక్రమించేస్తున్నారు. దీని వలన పాఠశాలలకు వెళ్లే చిన్నారులు.. ఆస్పత్రులకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితులు ఆటోలు, అంబులెన్స్‌లకు ఆటంకం ఏర్పడుతోంది. అడ్డదిడ్డంగా వాహనాలను పార్క్ చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు.

ఏయూలో చదువుకోవడం గొప్ప అనుభూతి

- లియోన్ దేశ అంబాసిడర్ రషీద్



వర్సిటీ అధికారులు, విద్యార్థులతో కేక్ కట్ చేస్తున్న రషీద్

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకోవడం గొప్ప అనుభూతి అని సియెరా లియోన్ దేశ అంబాసిడర్ (యు.ఏ.ఇ) రషీద్ సిసే అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శనివారం సందర్శించిన ఆయన అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న సియెరా లియోన్ విద్యార్థులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యు.ఏ.ఇలో అనేక విశ్వ విద్యాలయాల్లో పర్యటించానని, కానీ ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. ఏయూలో చక్కటి వసతులు, మంచి వాతావరణం ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ చదువుతున్న తమ దేశ విద్యార్థులు ఉత్తమ విలువలు సైతం నేర్చుకోవడం వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న సియెరా లియోన్ దేశ విద్యార్థులతో కలిసి స్టూడెంట్ యూనియన్ బాడీని ప్రారంభించారు. యూనియన్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ రషీద్ సిసే ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం సంతోషకరమన్నారు. ఏయూలో 58 దేశాల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ఆఫ్రికా దేశాల నుంచి సుమారు 700 మంది విద్యార్థులు ఉండటం మరో విశేషమన్నారు. ఇప్పటికే వర్సిటీలో అమెరికన్ కార్నర్ ఉందని, వెస్టన్ ఆస్ట్రేలియన్ కార్నర్‌ను సైతం పూర్తి స్థాయిలో నెలకొల్పబోతున్నామని తెలిపారు. విదేశీ విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ కల్పనే ఆంధ్ర విశ్వ విద్యాలయం లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం రషీద్ సిసేను సత్కరించారు.

జాతీయ స్థాయిలో రాణించేలా తోడ్పాటు

విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించేలా తోడ్పాటు అందిస్తామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం ఆయన అభినందించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించిన కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ కేంద్రం తరఫున పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకున్న ఫార్మసీ కళాశాల, లా కళాశాల విద్యార్థినులు సృజన, హర్షితకు వీసీ శుభాకాంక్షలు తెలిపారు. ఏయూ విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి వర్సిటీకి పేరు తీసుకురావడం సంతోషకరమన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి బిల్ కలెక్టర్ మృతి



సత్యనారాయణ(ఫైల్)

పెందుర్తి: తమ ఫ్లాట్‌లోని బాల్కనీలో విద్యుత్ బల్బ్ మారుస్తూ ప్రమాదవశాత్తు జారిపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అప్పన్నపాలెం సమీపంలోని బాలాజీ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో శనివారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలివి.. జీవీఎంసీ 94వ వార్డు వెంకటాపురం ప్రాంతంలో బిల్ కలెక్టర్ (జీవీఎంసీలో ఔట్‌సోర్సింగ్)గా పనిచేస్తున్న దాడి వెంకట సత్యనారాయణ (47) బాలాజీ హైట్స్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. శనివారంవిధులకు వెళ్లిన సత్యనారాయణ మధ్యాహ్నం భోజనం నిమిత్తం ఇంటికి వచ్చాడు. భోజనం అనంతరం బాల్కనీలో పోయిన బల్బ్ మార్చేందుకు గోడ ఎక్కాడు. గోడ మీద నుంచి కాలు జారడంతో మొదటి ఫ్లోర్ నుంచి కింద పడిపోయాడు. తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో సత్యనారాయణను గోపాలపట్నంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మరణించాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరితాత దర్యాప్తు చేస్తున్నారు.